ఇవన్నీ ఆర్‌అండ్‌బీ దారుణాలే!



ధ్వంసమైన కారిపాకం ఆర్‌అండ్‌బీ రోడ్డు

ఈ చిత్రంలో కనిపిస్తున్న ఆర్‌అండ్‌బీ రోడ్డు బత్తలవల్లం చెక్‌పోస్టు నుంచి కారిపాకంకు వెళ్లే ప్రధాన రోడ్డు మార్గం. అధిక టన్నేజీతో వెళ్తున్న గ్రావెల్ టిప్పర్ లారీ కారణంగా రోడ్డు పూర్తిగా ధ్వంసమవుతోంది. తారు లేచిపోయి రోడ్డు రూపురేఖలు మారిపోతున్న పరిస్థితి. ఇంత జరుగుతున్నా అధిక బరువు రవాణాను నియంత్రించాల్సిన రవాణాశాఖ అధికారులు పత్తా లేకుండా పోతున్నారు.





బత్తలవల్లం చెక్‌పోస్టు సమీపంలో ఆర్‌అండ్‌బీ రోడ్డులో ఏర్పడిన పగుళ్లు, గుంతలు, తారుపోయి మట్టి రోడ్డుగా మారిన కారిపాకం ఆర్‌అండ్‌బీ రోడ్డు

- వరదయ్యపాళెంలో అడ్డూ అదుపు లేని గ్రావెల్ అక్రమ రవాణా
- లారీలు, టిప్పర్లు అధిక లోడుతో వెళ్తుండడంతో రూపురేఖలు కోల్పోతున్న రోడ్లు
- వాహనదారులకు తప్పని నరక ప్రయాణం
- స్థానిక గ్రామస్తులకు తప్పని అవస్థలు
- పట్టించుకోని ప్రభుత్వ యంత్రాంగం

వరదయ్యపాళెం: మండలంలోని గ్రామీణ రోడ్లు రూపురేఖలు కోల్పోతున్నాయి. అక్రమంగా గ్రావెల్ తరలించే టిప్పర్లు అధిక లోడుతో వెళ్తుండడంతో రోడ్లు ఛిద్రమవుతున్నాయి. మట్టిరోడ్లలో పెద్ద పెద్ద గోతులు ఏర్పడుతున్నాయి. ముఖ్యంగా వరదయ్యపాళెం మండలం బత్తలవల్లం, వితయ్యపాళెం, పులివల్లం గ్రామాల్లో గ్రావెల్ అక్రమ రవాణాకు అడ్డూ అదుపు లేకుండా పోయింది. దీంతో ప్రధానంగా బత్తలవల్లం ప్రధాన రహదారి నుంచి కారిపాకంకు వెళ్లే ఆర్‌అండ్‌బీ రోడ్డు పూర్తిగా రూపురేఖలు కోల్పోతోంది. కనీసం గుర్తు పట్టని రీతిలో రోడ్డు మారిపోతోంది. పలుచోట్ల తారు లేచిపోయి భారీ గుంతలు ఏర్పడ్డాయి. దీంతో రాకపోకలకు ఇబ్బందికరంగా మారుతోంది. ప్రధానంగా వితయ్యపాళెం, పులివల్లం, బత్తలవల్లం చెక్‌పోస్టు సమీపంలో రోడ్డు ధ్వంసమైంది.

అధిక టన్నేజిని అడ్డుకోలేరా?:

ప్రధానంగా పులివల్లం వితయ్యపాళెం నుంచి తమిళనాడుకు రోజువారీ వందల టిప్పర్ లారీల నుంచి గ్రావెల్ అక్రమ రవాణా జరుగుతోంది. దీంతో సింగిల్ రోడ్డుగా ఉన్న తారురోడ్డు మీదుగా 70 టన్నులకు పైగా బరువు కలిగిన లారీలు రవాణా అవుతుండడంతో రోడ్డు పూర్తిగా ధ్వంసమవుతోంది. అయితే ఇంత దారుణంగా రోడ్లు పాడవుతున్నప్పటికీ నియంత్రించాల్సిన రవాణాశాఖ అధికారులు తమకేమీ పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. కారణం గ్రావెల్ మాఫియా నుంచి భారీ ఎత్తున అందుతున్న ముడుపులు ప్రభావమే.

వాహనదారులకు నరకం

దారుణంగా ధ్వంసమైన కారిపాకం రోడ్డు మార్గంలో ప్రయాణం వాహనదారుల ప్రాణాల మీదకు తెస్తోంది. అడుగడుగునా పడిన గుంతలు, కంకర తేలిన మార్గంలో వాహనదారులు రాకపోకలకు తీవ్రంగా అవస్థలు పడుతున్నారు. ఇంత జరుగుతున్నా అటు ప్రభుత్వ యంత్రాంగం గానీ, ఇటు పాలకులు గానీ పట్టించుకోవడం లేదని ఆ ప్రాంత ప్రజలు వాపోతున్నారు.

అలసత్వం వహిస్తే అంతే..

గ్రావెల్ అక్రమ రవాణా ఇలాగే కొనసాగితే కొద్దిరోజులకు రోడ్డు పూర్తిగా ధ్వంసం కావడం ఖాయమని స్థానిక ప్రజలు, వాహనదారులు వాపోతున్నారు. పరిమితికి మించి టిప్పర్లలో గ్రావెల్ తరలిస్తున్న వాహనాలను తక్షణమే సీజ్ చేయాలని స్థానికులు కోరుతున్నారు. అధికారులు పట్టించుకోకపోతే స్థానిక ప్రజలు తిరుగుబాటు చేసేందుకు సిద్ధమవుతున్నారు.





వితయ్యపాళెం వద్ద కంకర తేలిన ఆర్‌అండ్‌బీ రోడ్డు, కారిపాకం మార్గంలో తారు లేచిన దృశ్యం

ఒక ఆటో.. 19 మంది విద్యార్థులు..



ఆటోలోని విద్యార్థుల సంఖ్యను లెక్కేస్తున్న ఎంఈఐ దామోదర్‌నాయుడు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని కొంతమంది ఆటోవాలాలు ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించి ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలకు చుట్టుపక్కల గ్రామాల నుంచి ప్రతి రోజు వందల సంఖ్యలో విద్యార్థులు వస్తుంటారు. ప్రధాన రహదారికి దూరంగా ఉండే విద్యార్థులు రాకపోకలకు బస్సులను కాకుండా ఆటోలను ఆశ్రయిస్తున్నారు. ఇదే అదనుగా ఆటోవాలాలు ఒక్కో ఆటోలో పరిమితికి మించి 15 నుంచి 20 మంది విద్యార్థులను తీసుకెళ్తూ ప్రాణాలను ప్రమాదంలో పడేస్తున్నారు. ఈ క్రమంలో శనివారం ఇదే తరహాలో 19 మంది విద్యార్థులతో వెస్టువరత్తూరు గ్రామానికి వెళ్తున్న ఆటోను స్థానిక పోలీసుస్టేషన్ వద్ద ఏంవీఐ దామోదర్‌నాయుడు ఆపి తనిఖీ చేశారు. 19 మంది విద్యార్థులను ఒకే ఆటోలో తరలించడం చూసి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆటోడ్రైవర్‌కు జరిమానా వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిమితికి మించి విద్యార్థులను, ప్రయాణికులను తరలిస్తే ఆటోలను సీజ్ చేస్తామని హెచ్చరించారు.

క్లుప్తంగా

ఐదుగురిపై కేసు నమోదు

సత్యవేడు: మండలంలోని శిరుణంబూదూరు చెరువు సమీపంలో ఉంచిన హిటాచీ అద్దాలు పగులు గొట్టిన ఆర్.రవి, అన్నామలై, పరంధామన్, ఎడిషన్, కుమార్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రామస్వామి తెలిపారు. వివరాలు.. ఊత్తుకోటకు చెందిన వినోద్ శిరుణంబూదూరు చెరువులో మట్టి తొలగించేందుకు అధికారికంగా ఇరిగేషన్ అధికారుల అనుమతి పొందాడు. రాయల్టీ కట్టి మట్టి తీసుకునేందుకు చెరువు వద్దకు హిటాచీని తీసుకొచ్చారు. అయితే శిరుణంబూదూరుకు చెందిన ఐదుగురు హిట్టాచీని అడ్డుకుని అద్దాలు పగులగొట్టారు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఈ ఐదుగురిపై కేసు నమోదు చేశామని ఎస్‌ఐ తెలిపారు. తమ చెరువులో మట్టి తరలిస్తున్నారని అడ్డుకోవడానికి వెళ్లినందుకే తమపై కేసులా అని బాధితులు అన్నారు.

వినూత్న రీతిలో బోధన



వినూత్నంగా బోధిస్తున్న మిమిక్రీ కళాకారులు కయ్యూరు బాలసుబ్రహ్మణ్యం

తొట్టంబేడు: మండలంలోని దిగువ సాంబయ్యపాళెం ఫౌండేషన్ పాఠశాలలో ఉపాధ్యాయులు, మిమిక్రీ కళాకారులు కయ్యూరు బాలసుబ్రహ్మణ్యం శనివారం ఆట విడుపుగా విద్యార్థులకు వినూత్న రీతిలో బోధించారు. మాట్లాడే బొమ్మతో అక్షరాలు పరిచయం చేస్తూ వెంట్రిలాక్విజం చేశారు. అట్ట ముక్కలతో అక్షరాలను తయారు చేసి బొమ్మతో చెప్పిస్తూ మిమిక్రీ ప్రదర్శించారు. విద్యార్థులు ఆనందంతో కేరింతలు వేస్తూ నేర్చుకున్నారు. కార్యక్రమంలో పాఠశాల విద్యా కమిటీ చైర్‌పర్సన్ కల్పన, వైస్ చైర్‌పర్సన్ నిర్మల పాల్గొన్నారు.

ఆగ్నేయ గణపతి తొలగింపు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వర ఆలయానికి అనుబంధంగా మూడవ మాడవీధిలో ఉన్న ఆగ్నేయ గణపతి స్వామి విగ్రహానికి ఈ నెల 30న సోమవారం పంచనామా జరుగుతుందని ఆలయాధికారులు సామవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆగ్నేయ గణపతి స్వామి కుంభాభిషేకం నిమిత్తం మరమ్మతుల్లో భాగంగా స్వామివారి విగ్రహాన్ని కూడా పంచనామా చేసి తొలగిస్తున్నామని పేర్కొన్నారు. మరమ్మతుల అనంతరం శాస్త్రోక్తంగా ప్రతిష్టిస్తామన్నారు.

ఉచిత హోమియో వైద్యశిబిరానికి స్పందన



రోగిని పరీక్షిస్తున్న హోమియో వైద్యులు


రేణిగుంట: మండలకేంద్రంలో నెలకు రెండు సార్లు ఉచితంగా హోమియో వైద్యం అందిస్తున్నారని, వైద్యం అవసరమైన వాళ్లు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వార్డు సభ్యులు ఎంజీ రెడ్డి కోరారు. స్థానిక పంచాయతీ కార్యాలయ ఆవరణలో శనివారం వార్డు సభ్యులు ఎంజీ రెడ్డి ఆధ్వర్యంలో ఉచిత హోమియో వైద్యశిబిరం నిర్వహించారు. పట్టణంలోని ప్రజలు పాల్గొని వైద్య పరీక్షలు చేయించుకున్నారు. డాక్టర్లు వైద్య పరీక్షలు నిర్వహించి రోగులకు ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఎంజీరెడ్డి మాట్లాడుతూ గత ఎనిమిది నెలలుగా హోమియో ఉచిత వైద్యశిబిరం నిర్వహిస్తున్నామని తెలిపారు. హోమియో వైద్యం ద్వారా అనేకమంది రోగాలను తగ్గించుకున్నారని, రేణిగుంట చుట్టుపక్కల గ్రామాల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

తహసీల్దార్ సీటు ఖాళీ.. విద్యార్థులు ఇక్కట్లు



ఖాళీగా దర్శనమిస్తున్న తహసీల్దార్ కుర్చీ

కేవీబీపురం: కుల, ఆదాయ, ఆధార్, నివేశన స్థలం వంటి ముఖ్యమైన ధ్రువీకరణ పత్రాల మంజూరుకు తహసీల్దార్ సంతకం తప్పనిసరి. అయితే ఇక్కడ తహసీల్దార్ కుర్చీ గత నెల రోజులుగా ఖాళీగానే ఉంది. ఇక్కడ పనిచేస్తున్న డీటీ మునిరత్నం ఇన్‌చార్జ్ తహసీల్దార్ హోదాలో పదవీ విరమణ పొందారు. అయితే అప్పటి నుంచి మండలానికి తహసీల్దార్‌ని కేటాయించలేదు. మరోవైపు ప్రజలు సైతం తీవ్ర సమస్యలు ఎదుర్కొంటున్నారు. విద్యార్థులు పాఠశాలలో చేరేందుకు ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాలు తప్పనిసరిగా కావాల్సి వస్తుండడంతో వాటి కోసం వందలాది మంది దరఖాస్తులు చేసుకుంటున్నా రు. అయితే వాటిని ధ్రువీకరించాల్సిన అధికా రి లేరు. ఇప్పటికైనా సంబంధిత జిల్లా అధికారులు స్పందించి కేవీబీపురం తహ సీల్దార్‌ను నియమించాలని, లేదా ఇన్‌చార్జ్ తహసీల్దార్‌ను అయినా నియమించి ధ్రువీకరణ పత్రాల సమస్యలను పరిష్కరించాలని మండల ప్రజలు కోరుతున్నారు.



ధ్రువీకరణ పత్రాల కోసం మీ సేవాకేంద్రాల వద్ద పడిగాపులు కాస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు

శేష వాహనంపై పరాశరేశ్వరస్వామి



శేష వాహనంపై పరాశరేశ్వరస్వామి

నారాయణవనం: టీటీడీ అనుబంధంగా ఉన్న చంపకవల్లీ సమేత పరాశరేశ్వర స్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. అందులో భాగంగా శనివారం రాత్రి స్వామివారి ఉత్సవర్లు శేషవాహనంపై అధిష్టించి పురవీధుల్లో విహరించారు. ఉదయం ఆలయాన్ని తెరచిన అర్చకులు పరివార దేవతలకు, మూలవర్లకు అభిషేకాలు, నిత్య కైంకర్యాలు చేపట్టారు. 10 గంటలకు చంపకవల్లి, పరాశరేశ్వర్లుకు స్నపన తిరుమంజనం నిర్వహించి ధూప, దీప నైవేద్యాలను సమర్పించి, భక్తులకు ప్రసాదాలను వితరణ చేశారు. సాయంత్రం కైంకర్యాలను అందుకున్న ఉత్సవర్లు శేష వాహనాన్ని అధిరోహించారు. సర్కారు హారతి అందుకున్న దేవేరులు గ్రామోత్సవంలో విహరిస్తూ భక్తుల నుంచి హారతులు అందుకున్నారు. కార్యక్రమాలను స్థానిక ఆలయాల ఏఈఓ పార్థసారథి, సూపరింటెండెంట్ ధర్మయ్య, ఆలయ అధికారి నాగరాజు, ఆర్జితం అధికారి భరత్ తదితరులు పర్యవేక్షించారు. ఉత్సవాల్లో అయిదో రోజు ఆదివారం రాత్రి స్వామివారు నంది వాహనం అధిష్టించి భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు.

ఉయ్యాల సేవలో కల్యాణ వెంకన్న



ఉభయ నాంచారులతో శ్రీనివాసుడు

నారాయణవనం: పద్మావతీ సమేత కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం సాయంత్రం దేవేరులకు ఊయ్యాల సేవ నిర్వహించారు. సుప్రభాత సేవతో ఆలయాన్ని తెరచిన అర్చకులు నిత్యపూజా కార్యక్రమాలు చేపట్టారు. ఉదయం నుంచి భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలను అందుకున్నారు. సాయంత్రం కైంకర్యాలను పూర్తి చేసిన అర్చకులు తిరుచ్చి వాహనంపై శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామిని అధిష్టింపజేశారు. ఊంజల్ మండపంలో గంట పాటు నిర్వహించిన ఊయ్యాల సేవలో ఉత్సవమూర్తులు భక్తులకు దర్శనమిచ్చా యి. ఆలయ అధికారి నాగరాజు, ఆర్జితం అధికారి భరత్, అర్చకులు నరసింహ భట్టాచార్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

మూడు గడ్డివాములు దగ్ధం



దగ్ధమవుతున్న గడ్డివాములు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని ఆర్.అనంతాపురంలో శనివారం మూడు గడ్డివాములు దగ్ధమయ్యాయి. ఇదే గ్రామానికి మంజుల, శారద, ఈశ్వరయ్యకు చెందిన 500 మోపుల గడ్డి కాలి బూడిద అయింది. రూ.5 లక్షలు నష్టం వాటిల్లిందని బాధితులు తెలిపారు. శ్రీకాళహస్తిలోని ఫైర్ సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేశారు. అయితే అప్పటికే గడ్డి మొత్తం కాలిపోయింది. ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించి ఆదుకోవాలని బాధితులు కోరారు.

ఉత్పత్తిదారుల సమాఖ్యతో మెరుగైన ఫలితాలు



మాట్లాడుతున్న వ్యవసాయాధికారి షణ్ముగం

బుచ్చినాయుడుకండ్రిగ: రైతు ఉత్పత్తిదారుల సమాఖ్య ద్వారా రైతు ఉత్పత్తిదారులు సంఘాలు సభ్యులకు ఎప్పటికప్పుడు వ్యవసాయ అనుబంధ రంగాల్లో మెలకువలు, పద్ధతులు, ప్రభుత్వం అందించే పథకాల సమాచారం ఇవ్వడం ద్వారా వ్యవసాయదారులు మెరుగైన ఫలితాలు పొందవచ్చని మండల వ్యవసాయశాఖ అధికారి షణ్ముగం తెలిపారు. శనివారం స్థానిక మండల వెలుగు కార్యాలయంలో రైతు ఉత్పత్తిదారుల సమాఖ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంట వేసే ప్రతి రైతు తమ పరిధిలోని రైతు సేవా కేంద్రంలో ఈపంట నమోదు చేసుకోవాలన్నారు. తద్వారా ప్రభుత్వం అందించే పథకాలు సక్రమంగా అందుతాయని తెలిపారు. అన్నదాత సుఖీభవ కింద అర్హత కలిగిన ప్రతి రైతుకు ప్రభుత్వం సంవత్సరానికి రూ.20 వేలు అందజేస్తుందన్నారు. జూలై నెలలో రైతుల ఖాతాల్లో నగదు జమ చేస్తుందని తెలిపారు. అనంతరం ఏపీఎం మునెయ్య మాట్లాడుతూ రైతులు ప్రకృతి వ్యవసాయం ద్వారా పంటలు పండించి పెట్టుబడి ఖర్చులు తగ్గించుకోవాలని, ఆరోగ్యాన్ని కాపాడాలన్నారు. పంట మార్పిడి ద్వారా ఒకే పొలంలో పలు రకాల పంటలు వేయడం ద్వారా అధిక దిగుబడితో పాటు, ఆదాయం వస్తుందని తెలిపారు. కార్యక్రమంలో సీసీలు వెంకటరత్నం, వీరజి స్వప్న, పయనీ, రైతులు పాల్గొన్నారు.

ఏపీఎంగా ఇందిర



ఇందిర

కేవీబీపురం: ఇందిరాక్రాంతి పథకం మండల నూతన ఏపీఎంగా ఇందిరా శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈమె తొట్టంబేడు మండలం నుంచి ఆమె సాధారణ బదిలీల్లో భాగంగా ఇక్కడికి వచ్చారు. గతేడాది కాలంగా నారాయణవణం ఏపీఎం కేవీబీపురం ఇన్‌చార్జ్ ఏపీఎంగా ఇక్కడ విధులు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఏపీఎం ఇందిరా మాట్లాడుతూ తన దృష్టికి వచ్చిన ప్రతీ సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపారు. ఇప్పటికే రుణాలు పొందిన గ్రూపుల నుంచి రికవరీ, కొత్త రుణాల మంజూరు వంటి విషయాలపై దృష్టిసారిస్తామని అన్నారు.

గ్రామాల్లో పారిశుద్ధ్యం మెరుగుకు చర్యలు



మాట్లాడుతున్న ఎంపీడీఓ వెంకటరత్నమ్మ

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని 28 గ్రామ పంచాయతీల్లో వర్షాకాలం మొదలు అవుతుండడంతో పారిశుద్ధ్యం మెరుగుకు అధికారులు చర్యలు చేపట్టాలని ఎంపీడీఓ వెంకటరత్నమ్మ తెలిపారు. ఆమె శనివారం తన కార్యాలయంలో గ్రామ కార్యదర్శులు, ఉపాధి సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో చెత్త నిల్వ లేకుండా ఉండడం కోసం ఉపాధి హామీ పథకంలో ప్రతి ఇంటి వద్ద మీటరు వెడల్పు, లోతు, పొడవుతో గుంతను తీసి అందులో వేసుకునేలా అవగాహన కల్పించాలని సూచించారు. చెత్తను ఎరువుగా మార్చుకుని పంట పొలాల్లో వాడుకునేలా గ్రామాల్లో అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఈఓపీఆర్‌డీ రాజశేఖర్, ఏపీఓ దేవరీ, తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ గురుమూర్తిని కలిసిన నేతలు



ఎంపీ గురుమూర్తిని సన్మానిస్తున్న డాక్టర్ కోగిల సుబ్రహ్మణ్యం

తొట్టంబేడు: మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు డాక్టర్ కోగిల సుబ్రహ్మణ్యం, సర్పంచుల సంఘం అధ్యక్షుడు నాగోలు వెంకటరమణారెడ్డి తిరుపతి ఎంపీ కార్యాలయంలో ఎంపీ మద్దిల గురుమూర్తిని శనివారం మర్యాద పూర్వకంగా కలిశారు. మండలంలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై జరుగుతున్న దాడులు, కేసుల గురించి వివరించారు. అనంతరం ఎంపీని ఘనంగా సన్మానించారు. ఆయనతో పాటు సర్పంచ్ నాగేంద్ర, నాయకులు నాగరాజు, తిరుపాల్ ,సుబ్బు, మణి తదితరులు పాల్గొన్నారు.

భూస్వాముల నుంచి రక్షణ కల్పించండి



తహసీల్దార్‌కు విన్నవిస్తున్న కళత్తూరు దళితులు

వరదయ్యపాళెం: తమ అనుభవంలో ఉన్న భూములకు రక్షణ కల్పించాలని కళత్తూరు దళితవాడకు చెందిన 15 కుటుంబాల వారు తహసీల్దార్‌కు విన్నవించారు. శనివారం వారు మాట్లాడుతూ మండలంలోని కళత్తూరు రెవెన్యూలో గల సర్వే నంబరు 605లో సుమారు 10 ఎకరాల భూమిని తామే సాగు చేసుకుంటున్నామని తెలిపారు. అయితే తాజాగా ఆ భూములు పక్క గ్రామానికి చెందిన ఓ వ్యక్తి తనకు చెందినవిగా చెబుతున్నారని వాపోయారు. సర్వే చేసేందుకు చూస్తున్నారని, ఈ ప్రక్రియను నిలుపుదల చేసి తమకు న్యాయం చేయాలని కోరారు. 50 ఏళ్లుగా చెట్టుపుట్టలుగా ఉన్న భూములను చదును చేసి సాగు చేసుకుంటున్నామని వివరించారు. అలాంటి భూములను ఎలాంటి సంబంధం లేని భూస్వాములు కొందరు తమవని చెబుతూ సర్వే అధికారులపై ఒత్తిడి తేవడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. దీనిపై తహసీల్దార్ సుధీర్ రెడ్డి స్పందిస్తూ క్షేత్రస్థాయిలో రికార్డులను పరిశీలన చేసి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.

జీవాలకు నట్టల నివారణ మందు తప్పనిసరి



మేకలకు నట్టల నివారణ మందు వేస్తున్న ఏడీ

సత్యవేడు: మేకలు, గొర్రెల పెంపకందారులు జీవాలకు తప్పనిసరిగా నట్టల నివారణ మందు తాగించాలని పశుసంవర్ధక శాఖ ఏడీ అఫ్సర్ సాహెద్ సూచించారు. శనివారం సత్యవేడు పంచాయతీలో పశువైద్య సిబ్బంది మేకలు, గొర్రెలకు నట్టల నివారణ మందు వేశారు. ఈ సందర్భంగా ఏడీ మాట్లాడుతూ జూలై 10వ తేదీ వరకు మండలంలో జీవాలకు నట్టల నివారణ మందు పంపిణీ కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. మండలంలో మేకలు 18464, గొర్రెలు 17416 ఉన్నట్లు తెలిపారు. ఇప్పటి వరకు 6700 జీవాలకు నట్టల నివారణ మందు తాగించినట్లు ఆమె తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ దయాకర్, వెటర్నటీ అసిస్టెంట్ సుందరం, వీఎల్ చిరాజ్, రైతులు పాల్గొన్నారు.

స్టార్టర్లు చోరీ



ఖాళీగా ఉన్న స్టార్టర్ బాక్స్

రేణిగుంట: మండలంలోని గాజులమండ్యం హరిజనవాడ పొలాల్లో శుక్రవారం రాత్రి మోటార్ స్టార్టర్లు, వైరును గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేసినట్లు రైతులు తెలిపారు. సుమారు రూ.20,000 విలువ చేసే ఎత్తుకెళ్లారని, పోలీసులు నిఘా ఉంచి పొలాల్లో చోరీ చేసే వారిని కట్టడి చేయాలని కోరారు. అయితే స్టార్టర్ల చోరీపై తమకు ఫిర్యాదు అందలేదని గాజులమండ్యం పోలీసులు తెలిపారు.

శనీశ్వరుడికి తైలాభిషేకం



శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వర ఆలయంలోని శనీశ్వరునికి శనివారం తైలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా పండితులు శాస్త్రోక్తంగా మంత్రోచ్చరణల నడుమ శనీశ్వరుడికి అభిషేకాలు చేశారు. అనంతరం భక్తులకు స్వామివారి అభిషేక జలాలను చల్లి దీవించారు. స్వామివారిని నల్లని వస్త్రాలు, పుష్పాలతో అలంకరించారు. నైవేద్యం సమర్పించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు.

విద్యార్థుల భద్రతే ముఖ్యం



బస్సుల రికార్డులను పరిశీలిస్తున్న ఏంవీఐ

బుచ్చినాయుడుకండ్రిగ: విద్యార్థుల భద్రతే ముఖ్యమని, ప్రైవేటు పాఠశాలల బస్సులకు తప్పనిసరిగా పర్మిట్ ఉండాలని, వాహనాలను నడిపే వారికి లైసెన్సు తప్పనిసరి అని శ్రీకాళహస్తి మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ దామోదర్‌నాయుడు తెలిపారు. ఆయన శనివారం బుచ్చినాయుడుకండ్రిగలోని స్థానిక పోలీసుస్టేషన్ వద్ద ప్రైవేటు స్కూల్ బస్సులను తనిఖీ చేశారు. వాహన రికార్డులు, ఫిట్‌నెస్, డ్రైవర్ల లైసెన్సు, ఆర్‌సీ, ఇన్సూరెన్స్, పొల్యూషన్, ఫస్ట్ ఎయిడ్ బాక్స్ వంటివి ఉన్నాయా ? లేదా అన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. అలాగే పిల్లలు బస్సు ఎక్కినప్పుడు, దిగినప్పుడు తీసుకోవాల్సిన జాగత్తల గురించి డ్రైవర్లకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ప్రైవేటు స్కూళ్ల యాజమానులు బస్సుల రికార్డులను సరిగా ఉంచుకోవాలని, బస్సుల్లో ఎక్కువమంది విద్యార్థులను ఎక్కించకూడదని సూచించారు. రికార్డులు సక్రమంగా లేని బస్సులను గుర్తించి సీజ్ చేస్తామని హెచ్చరించారు. బస్సులు ప్రమాదాలకు గురైతే పాఠశాల యాజమాన్యాలదే బాధ్యత అన్నారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

ఎంఈఓతో గ్రామస్తుల వాగ్వాదం





ఎంఈఓతో వాగ్వాదం చేస్తున్న గ్రామస్తులు, విద్యార్థులు హాజరు కాకపోవడంతో ఖాళీగా తరగతి గది

- పాఠశాలకు తాళాలు తీసి ముళ్లకంచె తొలగింపు

శ్రీకాళహస్తి: మండలం ఎడాం ఎస్టీ కాలనీలో పాఠశాలకు తాళాలు తీసి, ముళ్లకంపను పోలీసుల సాయంతో విద్యాశాఖ అధికారులు తొలగించారు. 3,4,5 తరగతులను భైరవకోన, ప్రైమరీ స్కూలు అబ్బాభట్లపల్లి ప్రైమరీ స్కూల్లో విలీనం చేయడంపై వివాదం నెలకొంది. దీనిపైన పోలీసులు, ఎంఈఓ భువనేశ్వర్ శనివారం పాఠశాలను పరిశీలించి 1,2 తరగతులు ఇక్కడే ఉంచుతున్నామని నాలుగో తరగతి నుంచి భైరవకోన పాఠశాలలో విలీనం చేస్తున్నామని తెలిపారు. దీనికి గ్రామస్తులు వ్యతిరేకించారు. ఎడాంలోనే పాఠశాల నిర్వహించాలని ఎంఈఓతో వాగ్వాదానికి దిగారు. ఎవరైనా అడ్డుకుంటే కేసులు పెట్టమని కలెక్టర్ చెప్పారని హెచ్చరించారు. దీంతో గ్రామస్తులు కేసులు పెడితే గ్రామం మొత్తం మీద పెట్టాల్సి వస్తుందని హెచ్చరించారు. విలీనం ఆపే వరకు పాఠశాలకు పిల్లలను హాజరుకారని తెలిపారు. కలెక్టర్ స్పందించి నిర్ణయం తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు

మా బడి.. మాకే కావాలి



పాఠశాల కోసం ధర్నా చేస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు

సత్యవేడు: మా స్కూల్ మాకు కొనసాగించాలని పేరడం గ్రామస్తులు , విద్యార్థుల తల్లిదండ్రులు నిరసన చేపట్టారు. శనివారం విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులు కలిసి సత్యవేడు–ఊత్తుకోట రోడ్డులో ధర్నాకు దిగారు. పేరడం పాఠశాలలోని 3,4,5 తరగతుల విద్యార్థులను రెండు కిలోమీటర్లు దూరంలోని మదనంబేడు స్కూల్‌కు తరలించడం మానుకోవాలన్నారు. 5 తరగతులను పేరడంలోనే కొనసాగించాలని డిమాండ్ చేశారు.